సాక్షి

నిజామాబాద్

మంగళవారం । 19 । మార్చి । 2024



డిగ్రీ కళాశాలకు రూ.5కోట్లు

మోర్తాడ్ డిగ్రీ కళాశాలకు పీఎంయూఎస్ హెచ్ఏ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5కోట్లు మంజూరు చేసింది.

- 8లో ▸





వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మూల్యాంకన విధుల్లో పాల్గొనాలి

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్మీడియెట్ జవాబుపత్రాల మూల్యాకనం ప్రారంభమైందని క్యాంప్ అధికారి రవికుమార్ సోమవారం తెలిపారు. బుధవారం నుంచి రెండో విడతలో అర్థశాస్త్రం, భౌతికశాస్త్రం జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. రెండో విడత మూల్యాంకన విధుల్లో పాల్గొనాల్సిన అధ్యాపకులకు ఇదివరకే ఆయా కళాశాలల లాగిన్లలో నియామకపత్రాలను ఇంటర్ బోర్డు నిక్షిప్తం చేసిందని తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధులకు హాజరుకానున్న అధ్యాపకులను రిలీవ్ చేయాలని సూచించారు. అధ్యాపకులను రిలీవ్ చేయని ప్రిన్సిపాల్‌లతోపాటు రిలీవ్ అయినప్పటికీ మూల్యాంకన విధులకు హాజరుకాని అధ్యాపకులపై ఇంటర్‌బోర్డు చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

నేడు 'రైతు నేస్తం' ప్రత్యక్ష ప్రసారం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని ఆర్మూర్, ముప్కాల్, మెంట్రాజ్‌పల్లి, ఎడపల్లి రైతు వేదికల్లో మంగళవారం 'రైతు నేస్తం' ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెలకువలు, ఆయిల్‌పామ్ సాగు, వేసవి కూరగాయల సస్యరక్షణ, మందుల వాడకంపై ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు శాస్త్రవేత్తలు సూచనలు చేస్తారని పేర్కొన్నారు. రైతులు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉన్న రైతువేదికల్లో హాజరు కావాలని డీఏవో కోరారు.

ఆటిజం పేరుతో ఆటలు

- డీఎంహెచ్‌వో ఆదేశించినా సీజ్ చేయని అధికారులు



నిజామాబాద్ నాగారం: ఆటిజం పేరుతో పిల్లల జీవితాలో ఆటలాడుతూ డబ్బులు దండుకుంటున్న వైనంపై ఈనెల 16న 'సాక్షి'లో 'నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఫిజియోథెరపీ అసోసియేషన్ సైతం డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసింది. క్లినిక్‌ను వెంటనే సీజ్ చేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్రమత్తమైన స్పీచ్ థెరపీ క్లినిక్ నిర్వాహకులు బోర్డులను తొలగించి లోపల మాత్రం క్లినిక్‌ను యథావిధిగా కొనసాగిస్తున్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు స్పీచ్ థెరపీ క్లీనిక్‌కు వెళ్లిన అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహించి సంబంధిత డాక్యుమెంట్లు తీసురావాలని నిర్వాహకులకు సూచించి వెళ్లిపోయినట్లు ఆరోపణలున్నాయి. క్లినిక్‌ను సీజ్ చేయాలని ఉన్నతాధికారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కిందిస్థాయి అధికారులు ఖాతరు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముడుపులు అందిన కారణంగానే సీజ్ చేయకుండా వదిలేశారని, నిర్వాహకులు గుట్టుచప్పుడుకాకుండా క్లినిక్‌ను కొనసాగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. కలెక్టర్ స్పందిస్తేనే అమాయక పిల్లల తల్లిదండ్రులు మోసపోకుండా ఉంటారని ఫిజియోథెరపీ అసోసియేషన్ సభ్యులు అంటున్నారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది







కాకతీయ సెంటర్ వెలుపల విద్యార్థుల క్యూ

పదో తరగతి పరీక్షలు షురూ..


- మొదటిరోజు 44 మంది గైర్హాజరు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. మొత్తం 141 సెంటర్లు ఏర్పాటు చేయగా, 21,914 మంది విద్యార్థులకుగాను 21,870 మంది హాజరయ్యారు. 44 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ 11 సెంటర్లను, ఫ్లయింగ్‌స్క్వాడ్ 49 సెంటర్లను తనిఖీలు చేశారు. అడిషనల్ కలెక్టర్ మూడు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మంగళవారం హిందీ పరీక్ష జరగనుంది. – నిజామాబాద్‌అర్బన్

రూ.2 కోట్లు హాంఫట్

- మాక్లూర్ సొసైటీలో స్వాహా చేసిన గోపు రంజిత్
- తల్లి సొసైటీ చైర్‌పర్సన్ పదవిని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యం
- అనుమతి లేకున్నా భవనాల కూల్చివేత
- సహకరించిన మాజీ డీసీవో సింహాచలం
- అక్రమాలు తేలినా శాఖాపరంగా చర్యలు తీసుకోని వైనం
- అక్రమాలపై ప్రశ్నించిన సొసైటీ సీఈవోకు తీవ్ర వేధింపులు

తల్లి చైర్‌పర్సన్ పదవిని అడ్డుగా పెట్టుకుని గోపు రంజిత్ మాక్లూర్ సొసైటీలో కోట్ల రూపాయల అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడు. ఇందుకు అప్పటి సహకార అధికారి సింహాచలం వెన్నుదన్నుగా నిలిచాడని ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు, టెండర్లు లేకుండానే వినియోగంలో ఉన్న సొసైటీ పాత భవనాలను కూల్చివేయించి కొత్తబిల్డింగ్‌లు నిర్మించారు. వీరిద్దరి అక్రమాలపై ఇటీవల విచారణకు వచ్చిన ప్రత్యేక అధికారికి సొసైటీ సీఈవోగా పనిచేసిన విష్ణువర్ధన్ ఫిర్యాదు చేశారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మాక్లూర్ సహకార సంఘంలో ఎలాంటి పదవి లేకుండానే రూ.2 కోట్లు స్వాహా చేసిన గోపు రంజిత్ తననెవరూ ఏమీ చేయలేరనే ధీమాతో ఇష్టారీతిన వ్యవహరించినట్లు తెలుస్తోంది. రంజిత్ తల్లి లక్ష్మి గత కొద్దిరోజుల క్రితం వరకు మాక్లూర్ సొసైటీ చైర్‌పర్సన్‌గా పని చేశారు. ఆమెను డమ్మీని చేసి రంజిత్ అంతాతానై అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడు. తన అక్రమాలకు అడ్డుగా ఉన్నవారిని అనేక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రంజిత్ అక్రమాలకు పాల్పడినట్లు తేలినప్పటికీ శాఖాపరంగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇందుకు అప్పటి జిల్లా సహకార అధికారి సింహాచలం, రంజిత్ అక్రమాలకు వెన్నుదన్నుగా నిలవడమే కారణం. ఇదిలా ఉండగా రంజిత్, సింహాచలం అక్రమాలపై ఇటీవల విచారణకు వచ్చిన ప్రత్యేక అధికారికి సొసైటీ సీఈవోగా పనిచేసిన విష్ణువర్ధన్ ఫిర్యాదు చేశారు.

■ ధాన్యం రవాణా లారీల ఏజెంట్లకు చెల్లించాల్సిన రూ.14 లక్షలను సైతం సింహాచలం చెల్లించకుండా మాక్లూర్ సొసైటీ నుంచి చెల్లించేలా ఒత్తిడి చేసినట్లు విష్ణువర్ధన్ తెలిపారు. కాగా ఈ రూ.14 లక్షలను తానే చెల్లించినట్లు సింహాచలం హైదరాబాదు కమిషనర్ ఆఫీస్‌లో చూపించాడు. ఈ విషయం తెలియడంతో విష్ణువర్ధన్ సొసైటీ పాలకవర్గ సభ్యులతో చర్చించి సదరు డబ్బుల కోసం ఒత్తిడి చేయడంతో ఏడాదిన్నర కాలం తరువాత డీసీవో ఖాతా నుంచి చెక్కు ద్వారా చెల్లించారు. ఈ విషయానికి సంబంధించి విష్ణువర్ధన్‌పై సింహాచలం కక్ష పెంచుకున్నారు. రంజిత్‌తో కలిసి తనపై, మాజీ సొసైటీ అధ్యక్షులపై గత 12 సంవత్సరాల నుంచి విచారణ చేయించి లేనిపోని అభియోగాలు మోపి వార్తలు రాయించినట్లు విష్ణువర్ధన్ పేర్కొన్నాడు.

■ సొసైటీకి ఏమాత్రం అవసరం లేనప్పటికీ ఉన్న పాత బిల్డింగ్‌లను ఎలాంటి అనుమతులు లేకుండానే కూల్చివేయించి టెండర్లు పిలవకుండా రంజిత్, సింహాచలం కలిసి కొత్త గోదాములను నిర్మించారు. రంజిత్ చేసిన నిధుల దుర్వినియోగం, ఎరువుల కుంభకోణం గురించి పాలకవర్గ సభ్యులతో ప్రస్తావించిన నేపథ్యంలో సింహాచలం తనను కక్షపూరితంగా సరెండర్ చేసినట్లు విష్ణు వాపోయాడు. ఇది చెల్లదని తెలిసి సెలవుపై వెళ్లాలని తనపై రాజకీయ ఒత్తిడి పెంచారని, వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తూ బలవంతంగా బయటకు పంపినట్లు విష్ణు వివరించాడు.

■ విష్ణువర్ధన్ సెలవుపై వెళ్లిన తర్వాత మాక్లూర్ సొసైటీలో కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం చేసినట్లు కొందరు పాలకవర్గ సభ్యు లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వీటిపై సింహాచలాన్నే చూడాలని చెప్పగా వాటిని బుట్టదాఖలు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా తనను సొసైటీలో చేర్చుకుని హెచ్‌ఆర్ పాలసీలోకి తీసుకురావాలని విష్ణువర్ధన్ సింహాచలంకు విన్నవించారు. అయితే తన అవినీతి వ్యవహారాలు ఎక్కడ బయట పడతాయోనని సింహాచలం, రంజిత్ సహకారంతో మినిట్స్‌లో దొంగచాటుగా రాయించి సస్పెండ్ చేసినట్లు సృష్టించాడని, హెచ్ ఆర్ పాలసీలోకి రాకుండా చేశాడని ఫిర్యాదులో విష్ణు వివరించాడు.

దీనిపై పాలకవర్గ సభ్యులు ప్రశ్నించగా విష్ణువర్ధన్‌ను సెలవుపై మాత్రమే పంపినట్లు ప్రస్తుత జిల్లా సహకార అధికారికి సింహాచలం చెప్పడం గమనార్హం. తనలాగే కొందరు సొసైటీ సీఈవోలు సింహాచలం తీసుకున్న డబ్బులను తిరిగి చెల్లించాలని అడిగినందుకు వారిపై పలు అభియోగాలు మోపినట్లు పేర్కొన్నాడు. ఇలాంటి అభియోగాలను జీర్ణించుకోలేని ధర్పల్లి, పాల్దా, గోవిందపేట సొసైటీల సీఈవోలు ఆత్మహత్యలు చేసుకున్నట్లు పేర్కొన్నాడు. ఇకనైనా పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరాడు. సింహాచలంతో కలిసి రంజిత్ రూ.2 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో విచారణ అధికారికి ఫిర్యాదు చేసినట్లు విష్ణు పేర్కొనడం గమనార్హం.

ఆధారాలతో ఫిర్యాదు..

మాక్లూర్ సహకార సంఘంలో 1985 అక్టోబర్ 1 నుంచి పనిచేస్తున్న సీఈవో హెచ్ విష్ణువర్ధన్ నిబద్ధతతో వ్యవహరించారు. ఈ క్రమంలో రంజిత్ విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడడంతో పాటు అవినీతిని విష్ణువర్ధన్‌పై నెట్టేందుకు కుట్రలు చేశాడని తెలుస్తోంది. దీంతో అవినీతి వ్యవహారాలకు సంబంధించి విష్ణువర్ధన్ ఆధారాలతో సహా అప్పటి జిల్లా సహకార అధికారిగా ఉన్న సింహాచలంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే రంజిత్‌తో కుమ్మక్కైన సింహాచలం విచారణ చేయలేదని విష్ణువర్ధన్ చెబుతున్నారు. అంతకుముందే రంజిత్‌తో కలిసి సింహాచలం తన పీఏ పేరిట మాక్లూర్ సొసైటీలో బంగారం తాకట్టు పెట్టి రూ.5 లక్షల రుణం తీసుకున్నాడు. కాగా రుణం తీసుకున్న కొద్ది రోజులకే రుణం చెల్లించకుండానే సదరు బంగారు ఆభరణాలను తీసుకెళ్లారు. తనను భయభ్రాంతులకు గురిచేసి బంగారు ఆభరణాలు తీసుకెళ్లినట్లు విష్ణువర్ధన్ వాపోతున్నారు. పైగా ఆ బంగారు ఆభరణాలను డొంకేశ్వర్ సొసైటీలో తాకట్టు పెట్టి మళ్లీ అక్కడ కూడా రుణం తీసుకున్నట్లు పేర్కొన్నాడు. విష్ణువర్ధన్ సింహాచలంపై ఒత్తిడి చేయడంతో మాక్లూర్ సొసైటీకి రూ.5 లక్షలు చెల్లించాడు. ఇప్పటివరకు వడ్డీ మాత్రం చెల్లించలేదు.

నిలిచిన పసుపు క్రయవిక్రయాలు

- వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల మధ్య వివాదం
- మార్కెట్‌యార్డు అధికారుల జోక్యంతో సద్దుమణిగిన లొల్లి

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పసుపుతో పాటు ఇతర పంట దిగుబడుల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల మధ్య వివాదం నెలకొనడంతో వ్యాపారులు బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. రైతులు సోమవారం మార్కెట్ యార్డుకు 20వేల బస్తాల పసుపును తీసుకొచ్చారు. ఏసీకేకే కమీషన్ ఏజెంట్ దుకాణంలో కొన్ని బ్యాగులు తూకం తక్కువగా వచ్చినట్లు వ్యాపారులు గుర్తించారు. దీంతో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్ల మధ్య వివాదం జరిగింది. ఎంతకాలంగా ఈ దందా చేస్తున్నారోనని వ్యాపారులు ఆరోపించారు. అసలు తూకం తక్కువగా చేయడంలో ఎవరి హస్తం ఉందని మార్కెట్‌కమిటీ అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో కమీషన్ ఏజెంట్ హస్తముందని వ్యాపారులు ఆరోపించగా.. అధికారులు ఆరా తీశారు. వ్యాపారులు బిడ్డింగ్‌లో పాల్గొనకపోవడంతో క్రయవిక్రయాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చివరకు అధికారుల విచారణలో కమీషన్ ఏజెంట్ హస్తం లేదని తేలడంతో పాటు తూకం వేసిన దడువాయి తప్పుగా రుజువైంది. దీంతో సదరు దడువాయిని మార్కెట్ కమిటీ అధికారులు 15 రోజుల పాటు సస్పెండ్ చేశారు. వివాదం సద్దుమణగడంతో మంగళవారం నుంచి క్రయవిక్రయాలు ప్రారంభంకానున్నాయి. సాయంత్రం 4 గంటలకు విన్నర్ లిస్టు ప్రకటించి, ఆ తర్వాత తూకం వేయనున్నారు.

మార్కెట్‌కు పసుపు తీసుకురావొద్దు

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మంగళవారం లాట్ ఐడీలు ఇవ్వబోమని, రైతులు పసుపును మార్కెట్‌కు తీసుకురావొద్దని సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం వచ్చిన పంట అంతా షెడ్ల కింద ఉందని, మంగళవారం పంటను తీసుకొస్తే షెడ్ల బయట ఉంచాల్సి వస్తుందని పేర్కొన్నారు. వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో పంటను మార్కెట్‌కు తీసుకురావొద్దని ఆయన కోరారు.

ఆటంకాలు లేకుండా ఓట్ల లెక్కింపు



సీఎంసీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- సీసీ కెమెరాలు, ఫైర్ అలారమ్స్ తదితర ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఆటంకాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన సీఎంసీ కళాశాలలో కొనసాగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతర పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్, ఫైర్ అలారమ్స్ ఇతర అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్‌లలో వాటర్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్‌తోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని, ఎక్కడా చెత్తాచెదారం ఉండకూడదని సూచించారు. అవసరమైన మరమ్మతుల పనులను వేగవంతంగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లతోపాటు ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూము ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి, ఏసీపీ రాజావెంకటరెడ్డి, మెప్మా పీడీ రాజేందర్, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, ఏడీఈ రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి యోహాన్, ఈడీఎం కార్తీక్, డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్, డీటీ శ్రీకాంత్, ఆర్ఐ సంతోష్ తదితరులున్నారు.

టీజీ క్రేజీ

- రవాణాశాఖకు కాసుల పంట
- ఫ్యాన్సీ నంబర్లకు ఆన్‌లైన్ బిడ్డింగ్
- రూ.9.69 లక్షల ఆదాయం



ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం వాహనాల రిజిస్ట్రేషన్ కోసం టీఎస్‌ను టీజీగా మారుస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈనెల 15 నుంచి 'టీజీ' అమలులోకి వచ్చింది. దీంతో వాహనదారులు తమకు ఇష్టమైన నంబర్లను పొందేందుకు పోటీపడుతున్నారు. టీజీ కోడ్‌తో ఫ్యాన్సీ నంబర్లకు జిల్లా రవాణాశాఖ ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ నిర్వహించగా, రూ.రూ.9,69,872 ఆదాయం సమకూరింది. నిజామాబాద్ ఆర్టీవోలోని ఫ్యాన్సీ నంబర్లకు రూ.5,40,967, ఆర్మూర్ ఆర్టీవోకు రూ.1,38,585, బోధన్ ఆర్టీవోకు రూ.90,300 ఆదాయం వచ్చింది. జిల్లాలో ఎక్కువగా 0789, 0001 ఫ్యాన్సీ నంబర్లకు పోటీ ఎక్కువగా కనిపించింది. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న వాహనాదారులకు పాత టీఎస్ కోడ్ నంబర్‌తోనే నంబర్లు కేటాయిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు తెలిపారు.

నిజామాబాద్ కోడ్.. టీజీ 16

ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాకు టీజీ కోడ్‌తో 16 నంబర్‌ను కేటాయించింది. దీంతో నిజామాబాద్‌కు టీజీ 16 0001 కాగా, ఆర్మూర్‌కు టీజీ 16ఏ 0001, బోధన్‌కు టీజీ 16బీ 0001ను కేటాయించారు. ఇప్పటి నుంచి స్లాట్ బుక్ చేసుకునే వాహనదారులకు ఈ సిరీస్ ద్వారా నంబర్లు కేటాయించనున్నారు.

నిజామాబాద్ ఆర్టీఏ

నంబర్	ధర
టీజీ 16 0789	52,665
టీజీ 16 0001	50,000
టీజీ 16 0678	40,500

ఆర్మూర్ ఆర్టీఏ

నంబర్	ధర
టీజీ 16ఏ 0009	50,000

బోధన్ ఆర్టీఏ

నంబర్	ధర
టీజీ 16బీ 0333	30,000

ఆర్డర్ కాపీలంటూ ఆగమాగం

- ఎలక్షన్ కోడ్‌ను పట్టించుకోని అధికారులు
- డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద అభ్యర్థుల పడిగాపులు

నిజామాబాద్‌నాగారం: వైద్యారోగ్యశాఖలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీటికి అధికారుల చర్యలు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఎలక్షన్ కోడ్‌ను పట్టించుకోకుండా ఆర్డర్ కాపీలు ఇస్తామని అభ్యర్థులను కార్యాలయానికి పిలిపించగా, వారు గంటలతరబడి పడిగాపులు కాశారు.

ముడుపులు ముట్టిన నేపథ్యంలో హడావుడి!

ఎంఎల్‌హెచ్‌పీకి సంబంధించిన 43 పోస్టులను భర్తీ చేసేందుకు సంబంధిత అధికారులు తిప్పలుపడుతున్నారు. 60మందికిపైగా జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 43 పోస్టులను జిల్లాలో ఉన్న వారికి మాత్రమే కేటాయించాలి. ఇక్కడే కొందరు అధికారులు చక్రం తిప్పారు. గైడ్‌లెన్స్‌ను తుంగలో తొక్కిమరీ 5శాతం నాన్‌లోకల్ ఇవ్వొచ్చంటూ 13మంది వద్ద ముడుపులు తీసుకున్నట్లు శాఖ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు. ఈ 13మందిలో బాసర జోన్‌కు సంబంధం లేకుండా హైదరాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వారు ఉండడంతో అందరూ అవాక్కవుతున్నారు. పైగా వారికి ఆర్డర్ కాపీలు ఇచ్చేందుకు సిద్ధమవడంతో వారు కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. సోమవారం వచ్చిన వారందరినీ వెనక్కి పంపించేశారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులు

పాత తేదీల్లో ఆర్డర్‌కాపీలు ఇచ్చేందుకు ప్రయత్నాలు

ముందస్తుగానే ముడుపులు అందుకున్న కొంతమంది అధికారులు పాత తేదీల్లో ఆర్డర్‌కాపీలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పలువురిని ఆర్డర్ కాపీలు లేకుండానే మల్లారం, గూపన్‌పల్లి, గుండారం తదితర పీహెచ్‌సీల్లో విధులకు పంపించారని సమాచారం. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన్నట్లు సమాచారం. ఈ విషయమై డీఎంహెచ్‌వోను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

క్లుప్తంగా

మేడిచర్లకు 'కీర్తి పురస్కారం'

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రానికి చెందిన కవి భారతి మేడిచర్ల ప్రభాకర్‌రావు హైదరాబాద్ పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం-2022 డాక్టర్ కేవీ రమణాచారి 'కీర్తి పురస్కారం'కు ఎంపికయ్యారని తెలంగాణ గాయత్రి ధార్మిక సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జనగామ చంద్రశేఖర శర్మ సోమవారం తెలిపారు. ఈ నెలా 20న డాక్టర్ ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహించే ప్రధానోత్సవ కార్యక్రమంలో తెయూ ఉపాధ్యక్షుడు తంగెడ కిషన్‌రావు పురస్కారాన్ని అందజేస్తారని పేర్కొన్నారు. ప్రభాకర్‌రావు పద్య రచన విభాగంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈయన అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఇప్పటివరకు మేడిచర్ల 27 పుస్తకాలను రచించారు.

ఎంపీవోపై దాడి సరికాదు



సుభాష్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు ఎంపీవోపై ఎంపీపీ దాడిని తెలంగాణ కలెక్టర్ పంచాయతీ వింగ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీపీవో చక్రవర్తుల తరుణ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు సంగ్రామ్, సహా కార్యాలయ ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంగ్రామ్ మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఎంపీపీపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు కృష్ణ, ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

బోర్గాం(పి) వీడీసీపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) గ్రామానికి చెందిన చామకూర సుధాకర్‌రెడ్డి అలియాస్ బాయికాడి సుధాకర్‌రెడ్డిని వీడీసీ సభ్యులు బహిష్కరించడంతో సీపీ కల్మేశ్వర్‌కు బాధితుడు సోమవారం ఫిర్యాదు చేశాడు. గ్రామంలో ఎస్సీ, పద్మశాలీ, రెడ్డి కులస్తులను బహిష్కరించినట్లు తెలిపారు. వీడీసీలపై పోలీసులు కేసు నమోదు చేసినా వారికి బెయిల్ మంజూరు కావడంతో ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సీపీ దృష్టికి తీసుకొచ్చారు. వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీని కలిసిన వారిలో రచ్చ ఆనంద్, గుండు బ్రహ్మయ్య, చిలుక శ్రీనివాస్, బత్తుల రవి ఉన్నారు.

సిరికొండ టు బాల్కొండ

- భూసారాన్ని పెంచేందుకు వ్యవసాయ భూముల్లోకి ఆవుల మందలు
- ప్రతి రోజు రూ. 2వేలు సంపాదిస్తున్న యజమానులు



బస్సాపూర్‌లోని పంట చేనులో ఆవులు

బాల్కొండ: పంట భూముల్లో భూసారం పెంచేందుకు రైతులు సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం పసుపు పంటకు రికార్డు స్థాయిలో ధర పలకడంతో పసుప పంటను సాగు చేసే నేలలో భూసారం పెంచేందుకు రైతులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో ఆవుల మందలను పంట చేనులో కట్టేయడం ఓ ప్రయత్నం. సిరికొండ మండలం నుంచి అనేక ఆవుల మందలు ఉమ్మడి బాల్కొండకు మేత కోసం వలస వచ్చాయి. ఆవుల పేడ, మూత్రం భూసారం పెంచడంలో ఎంతో ఉపయోగపడతాయి. దీంతో రైతులు తమ పంట చేనులో రాత్రి వేళల్లో కట్టివేస్తున్నారు. ఇలా ఒక్కో రైతు వారం నుంచి 10 రోజులు తమ పంట చేనులో కట్టేసి భూసారం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

జొన్న పంటలు అధికం..

ప్రస్తుతం పంట భూములు ఖాళీగా ఉండటంతో పశువుల మేత కోసం సిరికొండ మండలం నుంచి బాల్కొండ మండలానికి అధికంగా ఆవుల మందలు వలస వచ్చాయి. ప్రధానంగా బాల్కొండ ప్రాంతంలో జొన్న పంటలను అధికంగా సాగు చేస్తారు. జొన్న సొప్ప పశువులకు బలవర్ధకమైన ఆహారం కావడంతో ఆవుల మంద యజమానులు బాల్కొండ వైపు మేతకు అధికంగా తీసుకువచ్చారు.

ఆవు పేడకు డిమాండ్..

మేతకు వచ్చిన ఆవులను చేనులో కట్టేయాలంటే రోజుకు రూ. 2 వేల నగదు, మానేడు బియ్యాన్ని రైతులు ఆవుల యజమానికి ఇవ్వాలి. నిత్యావసర సరుకులు అందించాలి. ఆవుల పేడకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో రైతులు అధికంగానే ధర చెల్లిస్తూ తమ పంట భూసారాన్ని పెంచుకుంటున్నారు. 150 ఆవులు ఉంటే రోజుకు రూ. 2 వేలు చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. గొర్రె, మేక, పశువుల పేడ, నల్లమట్టిని రైతులు పంట చేనుల్లో వేస్తూ తమ పంట భూసారాన్ని పెంచేందుకు వినియోగిస్తున్నారు.

రోజుకు రూ. 2 వేలు..



ఆవుల మందను మేత కోసం బాల్కొండకు తీసుకు వచ్చాం. మందను పంట చేనులలో పడుకోబెడితే రైతులు రోజుకు రూ. రెండు వేల నగదు, బియ్యం అందిస్తున్నారు. వరి చేనులు కోతలు కోసే వరకు ఇక్కడే ఆవులను మేపుకొంటూ జీవనం సాగిస్తాం.

– జబ్బర్, ఆవుల యజమాని, కొండాపూర్

డిగ్రీ కళాశాలకు రూ.5 కోట్లు మంజూరు



మోర్తాడ్ డిగ్రీ కళాశాల భవనం

- పీఎంయూఎస్‌హెచ్‌ఏ పథకం ద్వారా మోర్తాడ్‌కు మంజూరైన నిధులు
- విద్యార్థులకు మౌలిక వసతులు, గ్రంథాలయం, ల్యాబ్‌ల అభివృద్ధికి వినియోగించే అవకాశం

మోర్తాడ్: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం రూ. కోట్ల నిధులను మంజూరు చేసింది. కళాశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, గ్రంథాలయం, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ల అభివృద్ధికి నిధుల కొరత తీర్చడానికి ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్ష అభియాన్(పీఎం యూఎస్‌హెచ్‌ఏ) పథకం కింద రూ.5 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో మోర్తాడ్‌తో పాటు భీమ్‌గల్, ధర్పల్లి, ఆర్మూర్, నిజామాబాద్, బాల్కొండ, బోధన్‌లలో డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. కాగా మోర్తాడ్ కళాశాలకే పీఎం యూఎస్‌హెచ్‌ఏ పథకం కింద నిధులు మంజూరు కావడం విశేషం. ఇప్పటికే నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న కళాశాలకు కేంద్ర ప్రభుత్వ సాకారంతో భారీ మొత్తంలో నిధులు కేటాయించడం ఎంతో ఊరటనిచ్చే అంశమని విద్యాభిమానులు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 కళాశాలలకు నిధులు మంజూరు కాగా ఇందులో జిల్లాలోని మోర్తాడ్ కళాశాల ఎంపికైంది. ఇప్పటికే న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన కళాశాలను అటానమస్ గుర్తింపు కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ టి పెద్దన్న, అధ్యాపకుల బృందం కృషి చేస్తోంది. ఇప్పుడు కేటాయించిన నిధులతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగనుంది.

సంతోషంగా ఉంది



డిగ్రీ కళాశాలకు పీఎం యూఎస్‌హెచ్‌ఏ ద్వారా నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉంది. నిధుల మంజూరుకు సహకరించిన ప్రాజెక్టు డైరెక్టర్ సౌందర్య జోసెఫ్‌కు కృతజ్ఞతలు. కళాశాలను మరింత అభివృద్ధి మార్గంలో నడిపిస్తాం. విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తాం.

– డాక్టర్ టి పెద్దన్న, ప్రిన్సిపాల్, మోర్తాడ్



పాంగ్రా వాగులో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న కూలీలు

యథేచ్ఛగా ఇసుక రవాణా



ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నా జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. నగరంలోని అమ్మవెంచర్ సమీపంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద పాంగ్రా వాగులో ఉన్న ఇసుకను అక్రమార్కులు దర్జాగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మోపాల్ సొసైటీ వైస్‌చైర్మన్ రాజీనామా

మోపాల్: మోపాల్ సొసైటీ వైస్ చైర్మన్ సింగిడి చిన్నారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను సీఈవో సాయికుమార్‌కు సోమవారం అందజేశారు. మూడు రోజుల క్రితం మోపాల్ సొసైటీ చైర్మన్‌గా గ్యానాజి గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. ఇంతలో వైస్ చైర్మన్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతో తన పదవికి చిన్నారెడ్డి రాజీనామా చేసినట్లు తెలిసింది. మంగళవారం పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన కాపీని డీసీవోకు అందజేయనున్నారు. ఆ తర్వాత వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడనుంది. చిన్నారెడ్డి ఈ పాలకవర్గంలో 13 నెలలపాటు ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించారు. కాగా వైస్ చైర్మన్ పదవికి ఇద్దరు డైరెక్టర్లు పోటీ పడుతున్నారు.

చెక్ పోస్టులు ఏర్పాటు

ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు చోట్ల ఎన్నికల కోడ్ మేరకు పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం నగరంలోని పలు పీఎస్‌ల పరిధిలో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పోలీసులు, ఎన్నికల అధికారులు వాహనాల తనిఖీ చేపడుతున్నారు.

జాతీయ కబడ్డీ జట్టు కెప్టెన్‌గా సుశాంక్



సుశాంక్

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి కబడ్డీ సీనియర్ జట్టు కెప్టెన్‌గా మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన కుంట సుశాంక్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లింగయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుశాంక్ ఇటీవల నల్గొండ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్ రాష్ట్ర జట్టును వెల్లడించారన్నారు. జాతీయ స్థాయి పోటీలు మహారాష్ట్ర రాష్ట్రం అహ్మద్‌నగర్‌లో ఈ నెల 21నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సుశాంక్‌కు జాతీయ జట్టుకు నాయకత్వం అప్పగించినందుకు జగదీశ్వర్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుశాంక్‌కు లింగయ్య, సంఘం ప్రతినిధులు, సురేందర్, సాయగౌడ్, సుబ్బారావు, గంగాధర్, రాజ్ కుమార్, జిల్ల కోచ్ మీసాల ప్రశాంత్, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి 3472 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షంతో వరద వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 7500, లక్ష్మి కాలువ ద్వారా 250, సరస్వతి కాలువ ద్వారా 400, గుత్పలిఫ్ట్ ద్వారా 270, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 347, ముంపు గ్రామాల ఎత్తిపోతల ద్వారా 312, ఆవిరి రూపంలో 472, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1064.60(19.5 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



పొతంగల్(రుద్రూర్): పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. పొతంగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

విజేత జట్లకు ఎస్ఈ అభినందన



నిజామాబాద్‌నాగారం: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్‌లో ప్రథమస్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. జిల్లాకు చేరిన క్రీడాకారులు ఎస్ఈ రవీందర్‌కు ట్రోఫీలను సోమవారం అందజేశారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎస్ఈ అభినందించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి గోపి, కోశాధికారి ఉత్తమ్‌సింగ్, ఎస్ఏవో రాజశేఖర్, ఏడీఈ తోట రాజశేఖర్, ఏడీఈ చంద్రశేఖర్, జేఏవోలు సురేశ్, సునీత, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మృతుడి బంధువుల ఆందోళన

- భూమి కాజేసేందుకు కుట్రచేశారన్న ఆరోపణ
- పట్టా పాస్‌పుస్తకం తిరిగి ఇచ్చేయాలని డిమాండ్

ఆర్మూర్‌టౌన్: జంటహత్య కేసులో నిందితుడైన చేపూర్‌కు చెందిన బండి గంగాధర్ ఆదివారం ఆర్మూర్ పట్టణంలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, గంగాధర్ భూమిని కాజేసేందుకు కొందరు కుట్రచేయడంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు సోమవారం పెర్కిట్‌లోని విద్యానగర్‌కు చెందిన ఓ న్యాయవాది ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి... 15రోజుల క్రితం చేపూర్‌లో కులసంఘం సభ్యులతో సమావేశమైన సమయంలో తాను ఓ న్యాయవాదికి రూ.5లక్షలు ఇవ్వాల్సి ఉందని గంగాధర్ తెలిపాడు.

ఇందుకోసం భూమిని విక్రయించేందుకు సదరు లాయర్ సమక్షంలోనే చేపూర్‌కు చెందిన ఓ వ్యక్తి మధ్యవర్తిత్వంతో రూ.5లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఈ విషయం కొనుగోలుదారు ప్రతికల్లో ప్రకటన చేశారు. ఇదిలా ఉండగా భూమిని కాజేసేందుకు కుట్ర చేయడం తోనే గంగాధర్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరికీ డబ్బులు ఇచ్చేది లేదని వారు ఆందోళన చేశారు. లాయర్ వద్ద ఉన్న పట్టాపాస్‌పుస్తకాలు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటనాస్థలానికి చేరుకొని మృతుడి బంధువులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



న్యాయవాది ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

బాల్య వివాహం అడ్డగింత

ఇందల్వాయి: మండలంలోని గన్నారంలో బాల్యవివాహాన్ని అధికారులు సోమవారం అడ్డుకున్నారు. గన్నారం పాఠశాలలో పదో తరగతి చదివి పరీక్షలు రాస్తున్న ఓ మైనర్ బాలికకు సిరికొండకు చెందిన ఓ వ్యక్తితో ఈ నెల 20న వివాహం చేయాలని ఇరుకుటుంబాలు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు సోమవారం బాలిక తల్లిదండ్రులను కలిసి బాల్య వివాహం నిలిపివేసేలా చర్యలు తీసుకున్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. డిచ్‌పల్లి సీడీపీవో స్వర్ణలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, ఐసీపీఎస్ కౌన్సిలర్ జమున, ఎస్సై మనోజ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్ ఉన్నారు.

నంబర్‌ప్లేట్ లేని బైకులు సీజ్

ఎల్లారెడ్డి: నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న ఐదు బైకులను సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో నంబర్ ప్లేట్లు లేకుండా నడుపుతున్న వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడపవద్దని ఎస్సై సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

రాజంపేట: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్మాల ప్రవీణ్(32) సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో నీరు పట్టేందుకు మోటర్ స్విచ్ ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతం సంభవించి మృతిచెందాడు. మృతుడి భార్య నిఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన సనిరాజ్ సంఘ్వి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన సంఘ్వి తిరిగి రాలేదు. కుటుంబీకులు, బంధువులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కులాస్‌పూర్‌లో..

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన నిఖిత అదృశ్యమైనట్లు ఏఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో హాస్టల్‌లో ఉంటూ బీటెక్ చదువుతున్న నిఖిత శనివారం ఇంటికి వస్తున్నానని చెప్పి రాలేదు. దీంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికి ఆచూకీ లభించలేదు. తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద కారులో మంటలు



మంటలను ఆర్పుతున్న సిబ్బంది

ఇందల్వాయి: మండల కేంద్రంలోని ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి కామారెడ్డి వైపు వెళుతున్న ఓ కారులో మంటలు చెలరేగినట్లు టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు.

నిర్మల్ నుంచి హైదరాబాద్‌కి కారులో వెళ్తున్న దిలీప్ అనే వ్యక్తి టోల్‌ప్లాజా వద్దకు రాగానే కారులో పొగలు గమనించిన సిబ్బంది అతన్ని అప్రమత్తం చేసి కారుని పక్కకి నిలపగానే మంటలు చెలరేగాయి. సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు మంటలను ఆర్పివేశారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

వేల్పూర్: మండలంలోని పడగల్ క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. వాటిపై చర్య కోసం సంబంధిత అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సోమవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పాల్వంచ మండలం ఆరేపల్లి ఆయిల్ మిల్ వద్ద ట్రాక్టర్ వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిల్లల చావుకు కారణమైన తల్లికి ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: క్షణికావేశంలో భర్తతో గొడవ పడి పిల్లలను కాలువలో తోసేసి తాను ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో ఇద్దరు పిల్లలకు చావుకు కారణమైన తల్లికి జిల్లా జడ్జి సునీత కుంచాల ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట్‌కు చెందిన పల్లెపు అమృత ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన పల్లెపు శ్రీనివాస్‌తో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమార్తె మణిశ్రీయ, ఆరు నెలల బాలుడు మనుతేజ ఉన్నారు. వీరు కూలీ పని చేసుకుంటూ జీవించేవారు. కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందులు, కొనుగోలు చేసిన ట్రాక్టర్ సక్రమంగా నడవకపోడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో అమృత తన తల్లిగారి ఇల్లు అయిన నందిపేట్‌కు వచ్చింది. ఫిబ్రవరి 28న నందిపేట్ మండలంలోని చిరాజ్‌పల్లి శివారులో ఉన్న గుత్ప ఎత్తిపోతల కెనాల్‌లో తన ఇద్దరు పిల్లలను కాలువలో తోసేసి అమృత కాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అదే సమయంలో పిల్లలు, అమృత కాలువలో కొట్టుకుపోవడాన్ని గమనించిన కానిస్టేబుల్ ఐనారి రాకేశ్ కాలువ వెంబడి పరుగెత్తి అమృతను రక్షించగా పిల్లలు నీటిలో కొట్టుకుపోయారు. దీంతో అమృతపై కేసు నమోదైంది. దీంతో న్యాయవిచారణలో పిల్లల మృతికి కారణమైన అమృతకు జడ్జి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, ఆత్మహత్యాయత్నానికి పాల్పడినందుకు ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష విధించారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవి రాజ్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఐఐసీటీ సందర్శన



భిక్కనూరు : తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగం విద్యార్థులు హైదరాబాద్‌లోని ఐఐసీటీని సోమవారం సందర్శించారు. ఐఐసీటీలో నిర్వహించిన సంయుక్త 2024 కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అక్కడి శాస్త్రవేత్తలు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నూతన పరిశోధనల గురించి విద్యార్థులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్రీ హెచ్‌వోడీ డాక్టర్ నాగరాజుతో పాటు కెమిస్ట్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీపోటీలు



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని గోర్గల్ గ్రామ బేడీల మైసమ్మ ఆలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన మల్లయోధుల కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. బేడీల మైసమ్మ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మల్లయోధులు రావడంతో పోరు రసవత్తరంగా సాగింది. కార్యక్రమంలో కుస్తీపోటీల నిర్వహకులు దుర్గారెడ్డి, లక్ష్మణ్, దుర్గయ్య, కమ్మరికత్త అంజయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

డీటీసీని కలిసిన ఆర్టీసీ ఆర్‌ఎం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ దుర్గాప్రమీలను సోమవారం నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీకి ఆయన పుష్పగుచ్ఛం అందించారు.